# అడ్డదారి

తెల్లవారగానే హెడ్‌సిస్టర్ మార్గరేట్ మెడికల్ వార్డు కొచ్చేసింది. సిస్టర్ మార్గరేట్ చాలా సీనియర్. ఆమె అంటే ఆసుపత్రి 'స్టాఫ్' అందరికీ హడలు. తెల్లని విగ్రహమూ, వొంటిరంగుతో కలిసిపోయే తెల్లని యూనిఫారమూ, జేబులలో మూడు ఫౌన్‌టెన్ పెన్నులూ, చేతిలో గాజుబొమ్మ పిడిగల పిట్టగొడుగూ, వయస్సు ముదిరినా యవ్వనమింకా దిగజారని జిగీ... మదగజయానంతో నడిచి వస్తుంటే ఫర్లాంగు దూరంలో ఫలానా ఆమె వొస్తోందని అందరికీ గుర్తే. రాగానే చిమచిమ లాడడం ఆమెకి అలవాటు. ఒచ్చి ఎవళ్ళమీదనో వొకళ్ళమీద విరుచుకుపడి ఇంగ్లీషుతో వొచ్చీరాని తెలుగు మిళాయించి, మాట్లాడుతున్నది ఏ భాషో తెలియని గడబిడలో ముంచెత్తి పారేస్తుంది. ఆ కోలాహలంతో అందరికీ తెలుస్తుంది సర్జికల్, మెడికల్ వార్డులో టి.బి. షెడ్డులో హెడ్ సిస్టరు వొచ్చిందంటే వొచ్చిందని.

వార్డంతా అపరిశుభ్రంగా వుంది; తోవలోనూ, రోగుల మంచాల దగ్గరా వొలిచిన నారింజ తొక్కలూ, నమిలిన తొనలూ, పారేసిన గింజలూ, లోషన్‌లో ముంచిపారేసిన దూదిపింజెలూ చెల్లాచెదురుగా పడివున్నాయి. చెత్తకుండలు వార్డుకి దూరంగా వుంచబడి వున్నాయి. దగ్గరగా వుంచాలనీ, వూడ్చిన చెత్త కుండీలలో కెత్తి ఆరు గంటలకల్లా ఆసుపత్రి కళాయి చేసినట్టు శుభ్రంగా వుంచాలనీ నూరిపోసి మరీ వెడుతోవుంటుంది రోజూ. సూపర్నెంటు రౌండ్సుకి వచ్చే టయిమయింది. అంతా గలీజుగా వుంది. నర్సింగ్ ఆర్డర్లీలు ఈ హడావుడికి అప్పుడే లేచారు గావును, కళ్లనులుముకొంటో ఈ ప్రపంచంలోకి పడలేదింకా. వట్టి నల్లమందు భాయీలు. మగనర్సులు ఆడనర్సులతో ఛలోక్తులు పోవడంతప్ప రోగుల మంచీ సెబ్బరా ఆసుపత్రి శుచీ శుభ్రతా ఏమీ పట్టించుకోరు – గావుకేకలు పెట్టింది. గొంతు చించుకుంది. "ఏడీ తోటీ రాములు, ఎక్కడా?" అని గర్జించింది పేలవలసిన బాంబు ఎవడిమీద విసరాలో తోచక. తోటీ రాములు బంగాళావేపునించీ గబగబా వొచ్చాడు. "ఏమిరా ఎదవా, ఏమిరా సేస్తున్నావు? ఇప్పుడు తెల్లవారెనా నీకు?" విరుచుకుని మీదపడింది. తోటీ రాములు బిక్కుబిక్కుమంటో నీళ్లు నమిలాడు. "పొద్దు పొడిచేశిందమ్మగారు ఆలిచ్చిమయిపోయిందండె" నంగినంగిగా గొణిగాడు. చెళ్ళున లెంపకాయ

కొట్టింది సిస్టర్ మార్గరేట్ ఆలిచిమయిందట, వెధవ; వెధవన్నర వెధవ; ఆలిస్యమయిందని తనే గోలెడుతున్నడాయెను. వాడు వొప్పుకునేదేమిటి? ఎందుకాలస్యమయిందో అహోరించక? కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి రామునికి. అంతటితోపోక "అమ్మగోరికి గేపకంలేదు గాముసు– పొద్దున్నే మొక్కలికి నీళ్ళుపోసి రమ్మన్నారుగదండి" అని తప్పెవరిదో అమ్మగారి మొహాన్నే బయటపెట్టి గుడ్లురుముతో తీక్షణంగా చూసాడు వాడు. బాంబు వాడిమీద విసురుదామనుకున్నది; కాని, తన చేతిలోనే పేలింది. కోపం రూపాయికి పన్నెండణాలు దిగజారిపోయి, ఏదో ఇరుకున బద్ద ట్టయింది సిస్టరికి. అయితే, వోటమి అంత సులభంగా అంగీకరించే ఘటం కాదాయెను. చుట్టూవున్న స్టాఫ్ నర్సులూ, పేషెంట్లూ అంతా అదోరకంగా చూసారు వాడివంక జాలిగా నేర మెవరిదో అర్థమైపోయినట్టు. వెధవ; కూకలేస్తున్నంతసేపూ గమ్మున వూరుకుని, తీరా లెంపకాయ కొట్టింతరవాత నోరు పెగిలింది వాడికి. సొంతపనులు వాడిచేత చేయించుకున్న వయనం నలు గురికీ తెలియాలని, నలుగురిలోనూ తనని చిన్నబుచ్చాలని.

తలా వొకమాటా అన్నారు. ఎవరిదారిని వారు చక్కాబోయారు. ఒకడు జాలిపడ్డాడు. ఒకడు ముక్కుమీద వేలేసుకున్నాడు. ఒకామె తలపంకించి "ఎంత అన్యాయం" అని చీత్కారంతో ముగించింది. తరవాత ఎవళ్ళ పనిలో వాళ్ళు మునిగిపోయారు. కాని, పొద్దున్న తిన్న లెంపకాయ రోజంతా పనిచేస్తూనే వుంది రాములు మెదట్లో. ఇంటిదగ్గర ఏదో దిగాలుపడి కూచున్నాడు. ఎవరితోనూ ఏమీ చెప్పలేదు. దెబ్బతగలగానే గప్పున కలబడదామనుకున్నాడు. కాని, తమాయించు కున్నాడు. తన వోరిమికి తోడివాళ్ళు ఎంతో అవహేళన చేసారు. కాని, ఎంతలేదన్నా తనపై ఆఫీసరు. పద్దవాళ్ళు చెడ్డవాళ్ళు కారులే అని నచ్చచెప్పుకున్నాడు. మర్నాడు సిస్టరమ్మ తనని పిలిచి "ఒరేయ్ రాముడూ, తొందర సేసినానులే. ఏమీ అనుకోమాకుమా" అని తప్పకుండా లోపాయికారీగా చెప్తుతుంది. చెప్పి తీరుతుంది" అని వాళ్ళతోనూ, వీళ్ళతోనూ అనేసి తృప్తిగా వూరుకున్నాడు. కాని, మర్నాడు గడిచింది. ఆ మర్నాడూ గడిచింది. ఏమీ అసందర్భం జరగనట్టే సంచరిస్తోంది సిస్టరమ్మ. అంతా మరిచిపోయినట్టున్నారు ఆ ఘటన. రెసిడెంట్ మెడికలాఫీసరు గారికి, డిస్ట్రిక్టు మెడికలాఫీసరు గారికీ కూడా తెలిసిందని తన చెవిని పడింది. కాని, ఎవరికీ చీమకుట్టినట్టయినా లేదే? వాడికాశ్చర్యమయింది. తడిమి చూచుకున్నాడు. దవడ మీద అయిదు వేళ్లూ అంటుకుపోయి సోకుతున్నాయి. దీనికి ప్రతీకార మాలోచించాలి అనుకున్నాడు.

వార్డుల దగ్గర వూడుస్తున్నా, రోగుల మంచాల దగ్గర 'ఫ్లిట్' పంపు కొడుతున్నా, ఫినాయిలు కలుపుతున్నా, కొళాయి దగ్గర స్పిటూన్లు కడుగుతున్నా వొకటే ధ్యాస. ఏమి చెయ్యాలీ అని:

రాత్తిరి హెడ్డు గుమాస్తా రాజారావుగారింటికి వెళ్లాడు, వెళ్లి సంప్రదించాడు. ఆయన చాణక్యుడు. హెడ్ సిస్టరంటే ఆయనకి వొహందుకు గుర్రుగా వున్నది. పిటీషన్ పెట్టమన్నాడు. బాగుందనుకున్నాడు రాములు. ఇట్లాంటి వోఘాయిత్యం కాయితాని కెక్కిందంటే కొంత కదలిక పుట్టక మానుతుందీ అనుకొన్నాడు. హెడ్డు గుమాస్తాగారి చేతినే పిటీషన్ వ్రాయించి వొ అర్థరూపాయి యిచ్చి టైపు చేయించి రెసిడెంట్ మెడికల్ ఆఫీసరుగారికిచ్చాడు. రోగం కుదిరింది. భేషైన పని జరిగిందనుకున్నాడు తోటీ రాములు. పిటీషన్ పెట్టినట్టుగూడా ఎవళ్లతోనూ చెప్పలేదు.

ఎందుకూ ఆర్భాటం? చేసేపని చల్లగా చెయ్యాలిగాని!... మూడు రోజులయింది. నాలుగు రోజులయింది. ఏమీ జరిగినట్టే అవుపించదు. తనకి తెలీకుండా రహస్యంగా సిస్టరమ్మని మందలించాడేమో... హెడ్డు గుమాస్తాగారికి మళ్లీ అవుపించాడు. కాయితమ్మీద చర్య ఏదయినా తీసుకుని వున్నట్టయితే తన రిజిష్టరులో నమోదు కావాల్నే... మరి అట్లాంటి వాసనే సోకలేదు. బుట్టదాఖలా చేసారన్నమాట అని చప్పరించేసాడు చివరికి.

ఈసారి సూపర్నెంటుకి, అంటే డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసరుగారికి పెట్టమని రెచ్చగొట్టాడు. అందులో ఆర్.యం.ఓ. గారికి ఫలానా తారీఖున వొక అర్జీ ఇచ్చినట్టు ఖచ్చితంగా వుదహరించ మన్నాడుకూడా. మళ్లీ పిటీషనువ్రాసి డి.యం.ఓ గారికిచ్చాడు. ఆయనకి హెడ్డు గుమాస్తాగారెంత చెబితే అంత. అర్జీ అందుకుని చదువుకున్నాడు డి.యం.ఓ. చదువుకుని ముసిముసిగా నవ్వి "సరేలే, పో" అన్నాడు. వెళ్లిపోతుంటే "చాలా దూరం వెళ్లిందే" అని తల పంకించాడు. అంతవరకూ తన చెవినేమీ పడనట్టు. తోటీరాములు రెండు రోజులు నిదానించాడు. ఏమీ చర్యతీసుకున్నట్టుగాని, తీసుకోదలచినట్టుగాని, తీసుకునే సంకల్పమున్నట్టుగాని సూచాయగానైనా అవుపళ్ళేదు రాములుకి. పైపెచ్చు సిస్టరమ్మా, డి.యం.ఓ. అతి యిష్టాగోష్ఠిగా మాట్లాడుకోగా రెండు మూడుసార్లు చూసాడుగూడా. ఓనాడు డి.యం.ఓ. సర్జికల్ వార్డుకి రౌండ్సుకి వచ్చాడు. 'ఎనీమీ కాన్' తీసుకొస్తూ ఆ ప్రసక్తి తేబోయాడు. కాని, డి.యం.ఓ. చాలా సీరియస్‌గా వున్నాడు. ఒక రోగి పరిస్థితిని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టాడు కావాలని. సమయం కాదని వెనక్కి తగ్గాడు రాములు.

మన్నాడు క్యాంపుకి వెళ్లిపోతున్నాడు డి.యం.ఓ. కారు దగ్గర నిలబడి "ఎన్‌డార్సు దయ చెయ్యలేదండి బాబయ్యా" అని అర్థించాడు ముక్తసరిగా.

ఓరి వెధవ: వీడికి ఎండార్స్‌మెంట్ కావాలిట. అంటే తానిచ్చిన పిటీషన్ మీద "ఫలానా చర్య తీసుకోవడమైనదీ" అని ఈ తోటీ దొరకి వ్రాతమూలకంగా తెలియబరచాలన్నమాట: "ఎన్‌డార్స్ కావాలీ? అని దెప్పిపొడిచాడు డి.యం.ఓ. అంతవరకూ వచ్చిందీ అన్నట్టు. ఎన్‌డార్స్ మెంటు రానే వచ్చింది. చదివించుకున్నాడు. తగిన చర్య తీసుకోవడమయినది అని వివరించి వున్నదందులో.

భోంచేసి తమలపాకులు నమల్తో పచారు చేస్తున్నారు నడవలో హెడ్డు గుమాస్తా రాజా రావుగారు. రాములు వొచ్చాడు. వ్యవహారం మళ్లీ మొదటికొచ్చిందే - కాయితమ్మీద జరిగిన బాగోతమంతా చూసాడాయన. విచారణ చెయ్యగా రాములు తాగి వొచ్చినట్టూ సిస్టరమ్మ గొడుగు కాలితో నెట్టినట్టూ ఆచూకి తెలియ వచ్చిందని రికార్డయి వుంది కాయితమ్మీద. తబిశీలుగా చెప్పాడు కోలుకొని వాడు నిర్ఘాంతపోయాడు. డి.యం.ఓ ఎవరినీ కనుక్కోలేదు. ఏమీ దర్యాప్తు చేయలేదు. పోనీ తాగినందుకు తనకి వార్నింగయినా ఇవాల్నా అదీలేదు. అబద్ధం మీద అబద్ధం పేర్చి పెడుతున్నా రన్నమాట ఎందుకైనా ముందుకు మంచిదని. ఎంత అక్రమం: తను సిస్టరమ్మని కొట్టమన్నాడా తిట్టమన్నాడా ప్రతీకారం కింద? వో చిన్న మందలింపు వొస్తుంది సిస్టరమ్మకి అనుకున్నాడంతే. అది లేదు సరిగదా ఎదురు తన మీదకి వుసిగొలుపుతున్నదన్నమాట డి.యం.ఓ. ని! అట్లాకాదు ఈసారి సర్జన్ జనరల్‌కి పిటీషన్ పెట్టమన్నాడు హెడ్డు గుమాస్తా.

అదీ అయింది. నేరుగా సర్జన్ జనరల్‌కి పిటీషను పెట్టినందుకు సంజాయిషీ ఇచ్చాడు డి.యం.ఓ. అదట్లా నొక్కిపెట్టి సర్జన్ జనరల్ పిటీషన్ మీద ఏమి చర్య తీసుకుంటాడో చూద్దామనుకున్నాడు రాములు. సర్జన్ జనరల్ ఆఫీస్ గుమాస్తా చేతిలో పడిందా కాయితం ముద్రపడి. మామూలు పంథాలో డి.యం.ఓ.ని వుచితమైన చర్య తీసుకోవలసిందని రాసిపెట్టాడు ఆ గుమాస్తా. సంతకమయింది. డిస్పాచ్ అయింది. ఏ ఆఫీసరు కేసంతా తన మీదికే తిప్పి తన కన్యాయం చేశాడో ఆ డి.యం.ఓ. చేతిలోకే వచ్చింది. ఇదివరకే తీసుకోవడమయినది అని రికార్డ్‌చేసి కాయితం లాడ్జిచేసాడు డి.యం.ఓ. అంటే కాయిత మిహా బబ్బున్నదన్నమాట.

ఈలోగా వొకచోట గలీజు అట్టేపెట్టాడనీ ఒక రోగి 'బెడ్‌పాస్' అడిగితే ఇవ్వలేదనీ ఒక యూరినల్ శుభ్రం చెయ్యలేదనీ చిలిపి చిలిపిగా సంజాయిషీలు వొస్తూనే వున్నాయి. సర్జన్ జనరల్‌కి పెట్టిన పిటీషనులో సిస్టరమ్మ తనని కొట్టినప్పుడు స్వయంగా చూసిన నర్స్‌లూ, ఆయాలూ, వార్డ్‌బోయ్‌లూ అందరినీ సాక్షులుగా ఉదహరించాడుకూడా. పోనీ లాంఛన ప్రాయంగా నయినా ఒక్కరిని ఏమి జరిగిందీ అని అడిగిన పాపానపోలేదు. పైగా వాళ్లందరికీ కోపమొచ్చింది మాతో చెప్పకుండా మమ్మల్నెందు కిరికించావూ అని. సరిపోయింది; నిజంగా ఆరావొస్తే వీళ్ళెవళ్ళూ తనవేపు పలుకుతారనుకుందుకాస్కారం లేదు. ఇదంతా రాజారావు కుట్రా? తను పెట్టిన అర్జీలన్నీ నీళ్ళు కార్చేందుకు ఇదో పన్నాగమా?

రాములికి చిరచిర లాడుతోంది. అనేశాడు అంతమాట ఆయన మొహాన్నే. రాజారావుకి భయమేసింది. కొంపదీసి ఈ పిటీషన్లన్నీ తనే పెట్టించానని పేలతాడేమో గోల ఈ అలగా జాతి కేమున్నదీ?

పోనీ తను తాగినట్టు రుజువు చేసి శిక్షవెయ్యనఖ్ఖర్లే? కాయితాలింక గుడ్డిగా పైకీ కిందికీ నడిచినట్టే నడిచి ఆఖరికి చతికిల బడతాయ్యేమిటీ? వాడి కర్థం కాలేదు. ఆ రోజంతా ఉగ్రుడై పోయాడు. రుసరుస లాడాడు. అర్థంలేని పేలాపనలు సూటీపోటీగా ప్రారంభించాడు.

రాత్రి పదయింది. నిజంగా మగాడు రాములు. సిస్టరమ్మ క్వార్టర్సుకు వెళ్లి కేకలు వేసాడు ఆమె బయటికి వచ్చి తెల్లబోయింది. చెళ్ళున లెంపకాయకొట్టి సైకిలుమీద తుర్రుమన్నాడు.

మర్నాడు ఆసుపత్రి తెరిచారు. తోటీ రాములు తన పనిలో తనున్నాడు. ఎవరి డ్యూటీ వాళ్ళు చేస్తున్నారు. అంతా ప్రశాంతంగానే గడిచిపోయింది. ఇంత గుంభనగా ప్రతీకారం సాధ్యమవుతుందని అనుకోలేదు రాములు. మళ్ళీ మూడో కంటికి తెలియదు. ఈ మాత్రం బుర్ర మొదట్లో వుంటే చుట్టుదారిని దేవులాడేవాడు కాదు. ఏ మొహం పెట్టుకుని తోటీరాములు లెంపకాయకొట్టాడని చెప్పుకొంటుందీ; అథవా చెపితే పైకనకపోయినా లోన హర్షించని వాడెవడూ.

ఆ రాత్రి గాఢంగా నిద్రపోయాడు తోటీరాములు.